ఓయూలో నిరసన తెలుపుతున్న నిరుద్యోగులు, బీఆర్‌ఎస్వీ నాయకులు

జాబ్‌లెస్ క్యాలెండర్‌పై భగ్గుమన్న నిరుద్యోగులు

- రెండు లక్షల ఉద్యోగాలతో మరో జాబ్ క్యాలెండర్ రావాలి
- రాహుల్‌గాంధీ తెలంగాణ యువతకు క్షమాపణ చెప్పాలి
- నిరుద్యోగులను రాజకీయాలకు బలి చేసిన ఘనత రేవంత్‌రెడ్డిదే
- మండిపడిన బీఆర్‌ఎస్వీ నాయకులు, నిరుద్యోగులు
- రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు, రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

హైదరాబాద్, (నమస్తే తెలంగాణ), ఉస్మానియా యూనివర్సిటీ/కరీంనగర్ కమాన్‌చౌరస్తా/యాదగిరిగుట్ట/సిద్దిపేట అర్బన్, ఆగస్టు 3: రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన జాబ్ క్యాలెండర్ ఓ బోగస్ అని బీఆర్‌ఎస్వీ నాయకులు, నిరుద్యోగులు మండిపడ్డారు. దానిని జాబ్‌లెస్ క్యాలెండర్‌గా అభివర్ణించారు. రెండు లక్షల ఉద్యోగాలతో జాబ్ క్యాలెండర్ మరోసారి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జాబ్ క్యాలెండర్‌పై శనివారం రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగులు, బీఆర్‌ఎస్వీ నాయకులు నిరసనలు, ధర్నాలు, దిష్టిబొమ్మ దహనాలు నిర్వహించారు. ఉస్మానియా యూనివర్సిటీ ప్రధాన గ్రంథాలయం ఎదుట ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. కరీంనగర్ ఎస్సారార్ డిగ్రీ కళాశాల ఎదుట, యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట, సిద్దిపేట కేంద్ర గ్రంథాలయంలో నిరసన వ్యక్తం చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరులో, నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. మిర్యాలగూడలో నిరసనకారులను పోలీసులు అడ్డుకొనేందుకు యత్నించగా ఉద్రిక్తత నెలకొన్నది. ఆయా ప్రాంతాల్లో నిరుద్యోగులు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి అశోక్‌నగర్‌లో నిరుద్యోగులను రెచ్చగొట్టి, వాళ్లతో ఓట్లు వేయించుకున్నారని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన సంవత్సరంలోనే రెండు లక్షల ఉద్యోగాలతో పాటు జాబ్ క్యాలెండర్‌ను ప్రకటిస్తామని చెప్పారని గుర్తు చేశారు. ఉద్యోగాల పేరిట నిరుద్యోగులను నమ్మించి మోసం చేసిన రాహుల్‌గాంధీ తక్షణమే తెలంగాణ యువతకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం విడుదల చేసిన క్యాలెండర్‌లో పరీక్ష నిర్వహించే తేదీలు, అర్హతలు తప్ప మరేమీ లేదన్నారు. ప్రభుత్వం క్యాలెండర్‌లో పొందుపరిచిన వివరాలతో నిరుద్యోగులకు ఏం లాభం చేకూరుతుందని ఎద్దేవా చేశారు. నిరుద్యోగులను తమ రాజకీయాలకు బలి చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికే దక్కుతుందని ఆరోపించారు. కేవలం స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా క్యాలెండర్ విడుదల చేసినట్టుందని అనుమానం వ్యక్తంచేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం యూపీఎస్సీ తరహాలో సరైన వివరాలతో జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని, లేకుంటే విద్యార్థి విభాగం తరఫున సీఎం క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఉస్మానియా యూనివర్సిటీ వద్ద బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కడారి స్వామి యాదవ్, కరీంనగర్‌లో బీఆర్‌ఎస్వీ శాతవాహన యూనివర్సిటీ ఇన్‌చార్జి చుక్క శ్రీనివాస్, బీఆర్‌ఎస్ సీనియర్ యువజన విభాగం ప్రతినిధులు వొడ్నాల రాజు, నారదాసు వసంతరావు, బొంకూరి మోహన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. యాదగిరిగుట్టలో బీఆర్‌ఎస్వీ నియోజకవర్గ కో-కన్వీనర్ ఒగ్గు మల్లేశ్, అడ్డగూడూరులో బీఆర్‌ఎస్వీ తుంగతుర్తి నియోజకవర్గ కార్యదర్శి బాలెంల అరవింద్, పట్టణాధ్యక్షుడు గూడెపు నరేశ్, మిర్యాలగూడలో బీఆర్‌ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి ఎండీ షోయబ్, సిద్దిపేటలో బీఆర్‌ఎస్వీ నాయకులు మేరుగు మహేశ్, యాదగిరి, సాయిచరణ్ గౌడ్, రమేశ్, లక్ష్మణ్, నాయకులు, నిరుద్యోగులు నిరసనలో పాల్గొన్నారు.

రేవంత్‌కు బుద్ధి చెప్తం

మొదటిపేజీ తరువాయి...

చేశారు. రేవంత్‌రెడ్డి గతంలో ప్రభుత్వ టీచర్లపైనా నోరు పారేసుకున్నారు. ప్రభుత్వ విద్యకు కేటాయించే బడ్జెట్‌లో మొత్తం టీచర్ల జీతాలకే సరిపోతున్నదని, ఒక్కో టీచర్ రూ. 60-80వేల జీతాలిస్తున్నామని, ఫలితంగా మౌలిక వసతులకు ఖర్చు చేయలేకపోతున్నామని వ్యాఖ్యానించారు.

57 శాతం ప్రైవేట్ టీచర్లే

విద్యాశాఖ లెక్కల ప్రకారం రాష్ట్రంలో 57 శాతం మంది ప్రైవేట్ టీచర్లే ఉన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 40,958 స్కూళ్లున్నాయి. వీటిల్లో 2,93,923 మంది పనిచేస్తున్నారు. ప్రైవేట్ స్కూళ్లు 10,814 ఉండగా, వీటిలో 1,66,564 మంది పనిచేస్తున్నారు. ప్రభుత్వ యాజమాన్యంలో 26,826 బడులుంటే వీటిలో 1,13,403 మంది టీచర్లు మాత్రమే పనిచేస్తున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ స్కూళ్లు 65 శాతముంటే వీటిలో పనిచేస్తున్న టీచర్ల శాతం 33.58 మాత్రమే. 26.4 శాతమున్న ప్రైవేట్ బడుల్లో మాత్రం 56.67 శాతం టీచర్లు పనిచేస్తున్నారు.

మెగా డీఎస్సీ ఏది?

విద్యాశాఖ తాజా గణాంకాల ప్రకారం రాష్ట్రంలో 1,25,058 టీచర్ పోస్టులున్నాయి. వీటిలో ప్రస్తుతం 1,03,759 మంది టీచర్లు మాత్రమే పనిచేస్తున్నారు. అంటే 21,299 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. తాజా టీచర్ల బదిలీలు, పదోన్నతులతో మరో 6 వేలకుపైగా సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులు ఖాళీ అయ్యాయి. ఈ మార్చి నుంచి రాష్ట్రంలో టీచర్ల పదవీ విరమణలు మొదలయ్యాయి. ఈ ఐదు నెలల కాలంలో మరో 4 వేలపైగా టీచర్లు రిటైర్ అయ్యారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో 25వేల పోస్టులతో మెగా డీఎస్సీ వేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చి విస్మరించింది. ప్రభుత్వం మెగా డీఎస్సీ వేయకపోవడంతో అర్హత ఉండీ ప్రభుత్వ ఉద్యోగాలు పొందలేకపోతున్నామని, ఈ క్రమంలో బతుకుదెరువు కోసం ప్రైవేటు టీచర్లుగా పనిచేస్తున్న తమపై సీఎం అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని టీచర్లు మండిపడుతున్నారు.

రేషనలైజేషన్ చేయట్లేదా?

రాష్ట్రంలోని ప్రభుత్వ బడుల్లో చేరుతున్న పిల్లల సంఖ్య ఏటా తగ్గుతున్నది. ఒక్క 2021-22 మినహా ప్రతి ఏటా ఎన్‌రోల్‌మెంట్ తగ్గుతూనే ఉంది. 2021లోనే నాలుగు లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చేరారు. అప్పట్లో మొత్తం విద్యార్థుల సంఖ్య 26 లక్షలుండగా, ఇప్పుడది 18లక్షలకు చేరినట్టు విద్యాశాఖ వర్గాలు చెప్తున్నాయి. పిల్లలు లేరన్న సాకుతో కేంద్రం రేషనలైజేషన్ చేయమని పదేపదే చెబుతున్నది. ఒకే ప్రాంగణం, ఒక గ్రామంలోని బడులను విలీనం చేయాలని తరుచూ ఆదేశాలిస్తున్నది. ఇటీవల టీచర్ల బదిలీలు, పదోన్నతుల్లోనూ ప్రభుత్వం అంతర్గతంగా రేషనలైజేషన్ నిబంధనలను అమలుచేసింది.

సీఎం క్షమాపణ చెప్పాలి

ఉపాధ్యాయులెవరైనా ఉపాధ్యాయులే. ప్రైవేట్, ప్రభుత్వం అంటూ వ్యత్యాసం తగదు. 33 లక్షల మంది విద్యార్థులకు చదువులు చెప్తున్న ఉపాధ్యాయుల పట్ల ఒక సీఎం అంత దారుణమైన వ్యాఖ్యలు చేయడాన్ని ఖండిస్తున్నాం. ప్రభుత్వ టీచర్లు అంత నిష్ణాతులే అయితే పదోన్నతులకు 'టెట్' నుంచి ఎందుకు మినహాయింపునిచ్చారు. రాష్ట్రంలోని ప్రైవేట్ టీచర్లకు సీఎం వెంటనే క్షమాపణ చెప్పి, వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి. లేదంటే కార్యాచరణను ప్రకటిస్తాం. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తాం.

- అయినేని సంతోష్‌కుమార్, తెలంగాణ స్కూల్స్, టెక్నికల్ కాలేజెస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు

లక్షలాది మందిని సీఎం కించపరిచారు.

రాష్ట్రంలోని లక్షలాది మంది ప్రైవేట్ ఉపాధ్యాయులను సీఎం కించపరిచారు. మా మనోభావాలను తీవ్రంగా గాయపరిచారు. సీఎం సభకు హాజరైన టీచర్ల పిల్లలు కూడా ప్రైవేట్ స్కూళ్లల్లో చదవడం లేదా? రూ.80వేల జీతం తీసుకునే టీచర్ పిల్లలకు రూ.8 వేల వేతనం తీసుకుంటున్న టీచర్ చదువు చెప్పడంలేదా. చాలీచాలనీ జీతాలతో, సెలవుల్లేకుండా, ప్రభుత్వంపై భారం పడకుండా మంచి ర్యాంకులు, మార్కులు సాధిస్తున్నాం. మా శ్రమను గుర్తించకుండా కించపరచడం బాధాకరం. ఈ ప్రభుత్వానికి తగిన బుద్ధిచెబుతాం. 10న ఆయన ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు.

- షబ్బీర్ అలీ, తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు

ప్రభుత్వ టీచర్లే.. 'ప్రైవేట్'లో చదివిస్తున్నారు

ప్రైవేట్ పాఠశాలల్లో ఇంటర్ పాస్, డిగ్రీ ఫెయిల్ అయిన అన్‌ట్రెయిన్డ్ టీచర్లతో బోధన సాగుతుందనడం సీఎం హోదాలో ఉన్న వ్యక్తి మాట్లాడాల్సిన మాటలు కావు. గత విద్యాసంవత్సరం వరకు రాష్ట్రంలో లక్షల మంది ఉపాధ్యాయులు టీపీటీ, హెచ్‌పీటీ, బీఎడ్, డీఈడీ కోర్సుల్లో శిక్షణ పొందినట్టు గణాంకాలు చెప్తున్నాయి. ప్రభుత్వ ఉపాధ్యాయుల పిల్లలే ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్నారనే విషయం సీఎం రేవంత్‌రెడ్డి మరిచిపోయారు. ట్రస్మా అసోసియేషన్ ద్వారా ఉపాధ్యాయులకు పలు కమ్యూనికేషన్ స్కిల్స్ డెవలప్‌మెంట్, ప్రజ్ఞా టీచర్స్, వికాసానికి సంబంధించిన అంశాల్లో శిక్షణ ఇస్తున్నాం. ప్రైవేట్‌లో పనిచేసే ఉపాధ్యాయులను 58 శాతం విద్యార్థుల తల్లిదండ్రులు మెచ్చుకోవడం ఇక్కడ జరిగే విద్యాబోధనకు నిదర్శనం. సీఎం వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని కోరుతున్నాం.

-యాదగిరి శేఖర్‌రావు, ట్రస్మా గౌరవాధ్యక్షుడు

అధికార గర్వంతో మాట్లాడినట్టుంది

రాష్ట్రంలోని ప్రైవేట్ ఉపాధ్యాయులనుద్దేశించి సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు అధికార గర్వంతో మాట్లాడినట్టుగా ఉంది. వ్యయ ప్రయాసలకోర్చి ఉన్నత విద్యాభ్యాసాలు పూర్తి చేసుకున్న మాకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగాలు కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యాయి. 'ఆడలేనమ్మ మద్దెల ఓడన్నట్టు'గా రేవంత్‌రెడ్డి సర్కారు ఎన్నికల మ్యానిఫెస్టోలో మెగా డీఎస్సీ వేస్తాం అని ప్రగల్భాలు పలికి.. అధికార పగ్గాలు చేపట్టాక ప్రైవేట్ ఉపాధ్యాయులను కించపరిచేలా మాట్లాడటం సబబు కాదు. రేవంత్‌రెడ్డి ప్రైవేట్ టీచర్లపై చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి.

-సరిత (బీఎస్సీ, బీఈడీ) ప్రైవేట్ ఉపాధ్యాయురాలు, రాయపర్తి, వరంగల్ జిల్లా

ప్రైవేట్ టీచర్లకు సీఎం క్షమాపణ చెప్పాలి

ఎల్‌బీ స్టేడియంలో ప్రైవేటు ఉపాధ్యాయులు, అధ్యాపకులపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి. ప్రైవేటు ఉపాధ్యాయులు అందిస్తున్న సేవలను గుర్తించే పెద్ద సంఖ్యలో విద్యార్థులను పంపిస్తున్నారు. ప్రైవేటు, ప్రభుత్వ ఉపాధ్యాయుల మద్దతుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి ఇలా మాట్లాడటం సరికాదు. ప్రైవేటు పాధ్యాయులకు అండగా ఉంటారని, వారికి ఉద్యోగ భద్రత కల్పించేలా చర్యలు తీసుకుంటారనుకుంటే.. ఇలా కించపర్చినట్టు మాట్లాడటం బాధాకరం. ముఖ్యమంత్రి వెంటనే ప్రైవేటు ఉపాధ్యాయులకు, అధ్యాపకులకు క్షమాపణ చెప్పాలి.

-పోకల నాగయ్య, అధ్యాపకుల సంఘం రాష్ట్ర కో-ఆర్డినేటర్

ప్రైవేటు టీచర్లకు అండగా కేసీఆర్

- కరోనా కాలంలో రూ. 2వేల సాయం
- ప్రతి టీచర్‌కు 25 కిలోల బియ్యం
- మానవత్వంతో ఆదుకున్నారని కితాబు

హైదరాబాద్, ఆగస్టు 3 (నమస్తే తెలంగాణ): ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్న టీచర్లను కించపరిచేలా రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ఆ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. డిగ్రీ ఫెయిలైనోళ్లే ప్రైవేట్ స్కూళ్లలో పనిచేస్తున్నారని ఉపాధ్యాయుల ముఖాముఖి కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి కామెంట్ చేయడంపై ప్రైవేట్ టీచర్లు మండిపడుతున్నారు. గతంలో ముఖ్యమంత్రిగా కేసీఆర్ తమకు అందించిన సహకారాన్ని గుర్తుచేసుకుంటున్నారు. కరోనా సమయంలో దేశంలో ఎక్కడా లేని విధంగా మానవీయకోణంలో నాటి ముఖ్యమంత్రిగా కేసీఆర్ స్పందించారు. ప్రైవేట్ టీచర్లను ఆదుకోవాలని నిర్ణయించారు. ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేసే బోధన, బోధనేతర సిబ్బందిని అక్కున చేర్చుకున్నారు. ప్రైవేట్ స్కూళ్లలో పని చేసే ఒక్కో ఉపాధ్యాయుడికి రూ.2 వేల ఆర్థిక సాయం, 25 కిలోల రేషన్ బియ్యం అందించారు. రాష్ట్ర వ్యాప్తంగా 10,534 ప్రైవేట్ పాఠశాలల నుంచి మొత్తంగా 2,06,345 దరఖాస్తులు రాగా, అందులో దాదాపు 1.20 లక్షల మందిని అర్హులను గుర్తించారు. వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి, వారికి సంబంధించిన బ్యాంకు ఖాతాలు తదితర వివరాలను సేకరించారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.2 వేల ఆర్థిక సాయాన్ని నేరుగా వారి అకౌంట్లలో వేయడంతోపాటు, 25కేజీల రేషన్ బియ్యాన్ని అందజేశారు. ఈ విషయాన్నే ప్రస్తుతం ప్రైవేట్ టీచర్లు గుర్తుచేసుకుంటున్నారు.

ఆరోగ్యం బాగాలేదన్నా.. సీఎం సభకు రావాలని హుకూం

వెళ్లివచ్చిన మర్నాడే ఉపాధ్యాయుడి మృతి


గంగయ్య(ఫైల్)

పాలకవీడు, ఆగస్టు 3 : సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలంలో గుండెపోటుతో ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి చెందాడు. తీవ్ర జ్వరంతో అవస్థ పడుతున్న ఆయన్ని బలవంతంగా సీఎం రేవంత్‌రెడ్డి సభకు తీసుకువెళ్లవడం వల్లే చనిపోయాడని బాధిత కుటుంబం ఆరోపిస్తున్నది. కుటుంబ సభ్యు లు తెలిపిన వివరాల ప్రకారం.. పాలకవీడు మండలం సజ్జాపురానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు యరగొర్ల గంగయ్య (41) పాలకవీడు ఉన్నత పాఠశాలలో సీనియర్ తెలుగు పండింట్‌గా పనిచేస్తున్నారు. గతంలో మేడారం పాఠశాలలో పని చేయగా, ఇటీవలే పదోన్నతిపై పాలకవీడు వచ్చారు. గంగయ్య రెండ్రోజులుగా జ్వరం తో బాధపడుతున్నారు. విద్యాశాఖ అధికారులు సీఎం మీటింగ్‌కు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించడంతో శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన సభకు వెళ్లాడు. శనివారం తెల్లవారుజామున ఇంటికి చేరుకొన్నాడు. మీటింగ్ హాజరైన ఉపాధ్యాయులకు శనివారం ఓడీ ఇవ్వడంతో ఇంటి దగ్గరే విశ్రాంతి తీసుకున్నాడు. జ్వరంతో బాధపడుతున్న గంగయ్యకు సాయంత్రం గుండెపోటు రావడంతో చనిపోయాడు.

అశోక్‌నగర్ వచ్చి సమాధానం చెప్పండి

2 లక్షల ఉద్యోగాలు ఎలా ఇస్తారో చెప్పాలని రాహుల్‌గాంధీకి కేటీఆర్ డిమాండ్



హైదరాబాద్, ఆగస్టు 3 (నమస్తే తెలంగాణ): రెండు లక్షల ఉద్యోగాల భర్తీ హామీని ఎలా నిలబెట్టుకుంటారో హైదరాబాద్‌లోని అశోక్‌నగర్‌కు వచ్చి నిరుద్యోగులకు సమాధానం చెప్పాలని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ చేశారు. ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ విడుదల చేసిన నేపథ్యంలో శనివారం ఎక్స్‌లో ఆయన స్పందిస్తూ అధికారంలోకి వచ్చిన ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న మాటలు నమ్మి యువత కాంగ్రెస్‌కు ఓటేసిందని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చి 8 నెలలు గడిచినా ఒక్క ఉద్యోగం ఇవ్వలేదని దుయ్యబట్టారు.

మూడు నెలల్లో ఎల్‌ఆర్‌ఎస్ పూర్తి

మొదటిపేజీ తరువాయి...

వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 2020 ఆగస్టు 31 నుంచి అక్టోబర్ 31 వరకు 25.70 లక్షల దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. ఇందులో హెచ్‌ఎండీఏ పరిధిలో 3.58 లక్షలు, జీహెచ్‌ఎంసీ పరిధిలో 1.06 లక్షలు, మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల పరిధిలో పరిధిలో 13.69 లక్షలు, గ్రామ పంచాయతీల్లో 6 లక్షలు, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలో 1.35 లక్షల దరఖాస్తులు ఉన్నాయని వివరించారు. వారు నాలుగేండ్లుగా పరిష్కారం కోసం ఎదురు చూస్తున్నారని, అత్యంత ప్రాధాన్యంగా పరిగణించి వీటిని పరిష్కరించాలని సూచించారు. అక్రమాలకు తావులేకుండా, నిబంధనల ప్రకారమే భూముల క్రమబద్ధీకరణ జరగాలని స్పష్టంచేశారు. మధ్య దళారుల ప్రమేయం ఉండరాదని, సాధారణ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని వెల్లడించారు. ప్రభుత్వ భూములు ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాల్లో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలనకు రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులతో కూడిన మల్టీ డిసిప్లినరీ బృందాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. సిబ్బంది కొరత ఉంటే ఇతర శాఖల నుంచి డిప్యుటేషన్‌పై తీసుకోవాలని అన్నారు. ప్రతిపాదనలు పంపిస్తే రెవెన్యూ శాఖ నుంచి సిబ్బందిని సర్దుబాటు చేస్తామని, అన్ని స్థాయిల సిబ్బంది, అధికారులకు తక్షణమే శిక్షణ నిర్వహించాలని స్పష్టం చేశారు. క్రమబద్ధీకరణ దరఖాస్తులపై జారీ చేసిన నోటీసుల సమస్యలను నివృత్తి చేసేందుకు అన్ని జిల్లా కలెక్టరేట్లు, స్థానిక సంస్థల కార్యాలయాల్లో సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, మున్సిపాలిటీలు మినహా మిగిలిన ప్రాంతాల దరఖాస్తులను జిల్లా కలెక్టర్లు పర్యవేక్షిస్తారని తెలిపారు. హెచ్‌ఎండీఏ పరిధిలో ఉన్న ఏడు జిల్లాల్లో అత్యంత విలువైన భూములు ఉన్నందున, క్రమబద్ధీకరణ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

'కేసీఆర్ ఉద్యోగాలు' మరో 1154

మొదటిపేజీ తరువాయి...

నిర్వహించారు. సెప్టెంబర్ 3, 2022న నోటిఫికేషన్ విడుదల చేసి, గత ఏడాది మే 21, 22న రాత పరీక్షలు నిర్వహించారు. ఈ ఏడాది మార్చి 18 నుంచి 22 వరకు, తిరిగి ఏప్రిల్ 3న సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ముగిసింది. ఆ తర్వాత జనరల్ ర్యాంకింగ్ లిస్టు విడుదల చేసి వెరిఫికేషన్ చేశారు.

టీజీపీఎస్సీని ముట్టడించిన అభ్యర్థులు

సర్టిఫికెట్లు వెరిఫికేషన్ ముగిసినప్పటికీ తుది ఫలితాలు విడుదల చేయడంలో టీజీపీఎస్సీ అలసత్వం ప్రదర్శించింది. ఫలితాలు విడుదల చేయాలని ఏఈఈ అభ్యర్థులు కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా గాంధీభవన్‌లో ధర్నా చేశారు. టీజీపీఎస్సీ కార్యాలయాన్ని ముట్టడించారు. దీంతో 3 నెలల తర్వాత ఫలితాలు విడుదల చేసినట్టు అభ్యర్థులు వెల్లడించారు.

సుప్రీంతీర్పు ఎవరికీ వ్యతిరేకం కాదు

- వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ
- ఎస్సీ వర్గీకరణ కోసం కేసీఆర్ పనిచేశారు
- మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు ప్రశంస
- హరితప్లాజా హోటల్‌లో మాదిగ నేతల భేటీ

హైదరాబాద్, ఆగస్టు 3 (నమస్తే తెలంగాణ): ఎస్సీ వర్గీకరణపై తాజాగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఎవరికీ వ్యతిరేకం కాదని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి అందరూ సమానులేనని చెప్పారు. ఈ తీర్పుతో మొత్తం మాదిగజాతి తలరాతలు మారబోవని, 15 శాతం రిజర్వేషన్ వస్తే మిగతా 85 శాతం కోసం పోటీపడేలా యువత సిద్ధంకావాలని సూచించారు. శనివారం హైదరాబాద్ హరితప్లాజాలో ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా భవిష్యత్తు కార్యాచరణపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక న్యాయవాదిని నియమించి సుప్రీంకోర్టులో వాదనలు వినిపించిందని తెలిపారు. 600 పేజీల తీర్పును మేధావులు పరిశీలించి నివేదికను ప్రభుత్వానికి అందిస్తే.. కమిటీవేసి పూర్తిస్థాయిలో చర్చించి ఆర్డినెన్స్‌కు చర్యలు చేపడుతుందని చెప్పారు. దేశంలో తెలంగాణలోనే తీర్పు తొలుత అమలుకానున్నదని, మాదిగజాతి కాంగ్రెస్ ప్రభుత్వానికి రుణపడి ఉంటుందని తెలిపారు. ఈ నెల 16 లేదా 17 తేదీల్లో మాదిగల సమ్మేళనం నిర్వహించి సీఎం రేవంత్‌రెడ్డిని సన్మానించేలా నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఎస్సీ వర్గీకరణ కోసం గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం సైతం చర్యలు చేపట్టిందని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు తెలిపారు. వర్గీకరణపై బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ అసెంబ్లీలో తీర్మానం చేసి ఆ ప్రతిని మోదీకి అందించారని గుర్తుచేశారు. రాష్ట్రంలో 70 లక్షల జనాభా ఉన్న మాదిగజాతి ఎటు ఓటు వేస్తే ఆ పార్టీ అధికారంలోకి వస్తుందని, తద్వారా హక్కులను సాధించుకోవాలని సూచించారు. తాను లీడర్‌గా తయారుచేసిన మొదటి వ్యక్తి మంద కృష్ణ అని తెలిపారు. సమావేశంలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్యేలు వీరేశం, సామేలు, లక్ష్మీకాంతారావు, సత్యనారాయణ, యాదయ్య, మాజీ మంత్రి పుష్పలీల, నాయకులు సంపత్‌కుమార్, పిడమర్తి రవి, ప్రొఫెసర్ కాశీం, రాష్ట్ర దళిత ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

సచివాలయంలో విద్యార్థులను అభినందిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

అమెరికా చదువులకు 2.22 కోట్ల సాయం

- అమెరికాలో మాస్టర్స్ చేసేందుకు నలుగురు వ్యవసాయ వర్సిటీ విద్యార్థుల ఎంపిక
- సచివాలయంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభినందన

హైదరాబాద్, ఆగస్టు 3 (నమస్తే తెలంగాణ): జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీకి చెందిన నలుగురు విద్యార్థులు అమెరికాలో మాస్టర్స్ చేసేందుకు అవసరమైన ఖర్చును ప్రభుత్వమే భరించనుందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. వరంగల్ జిల్లా గోపనపల్లికి చెందిన ప్రవల్లిక, కరీంనగర్ జిల్లా మామిడిపల్లికి చెందిన పావని, హైదరాబాద్‌కు చెందిన ఐశ్వర్య, నిధాబేగం ఈ ఫెలోషిప్‌నకు ఎంపిక కాగా వారిని శనివారం సచివాలయానికి పిలిపించి అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వ్యవసాయ, ఉద్యాన వర్సిటీలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఉన్నత విద్య చదివే స్థోమతలేని విద్యార్థులకు ఆర్థిక సాయం చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఒక్కో విద్యార్థికి రెండు సంవత్సరాలకు రూ. 55.50 లక్షల చొప్పున మొత్తం నలుగురు విద్యార్థులకు రెండు సంవత్సరాలకు రూ. 2.22 కోట్లు విడుదల చేశామన్నారు. ఈ సందర్భంగా మంత్రికి విద్యార్థులు, తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

కార్పొరేషన్లను బలోపేతం చేయాలి

రాష్ట్రంలో వ్యవసాయ అనుబంధ కార్పొరేషన్లను బలోపేతం చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. శనివారం సచివాలయంలో కార్పొరేషన్ల చైర్మన్లు, ఎండీలతో మంత్రి సమీక్ష నిర్వహించి మాట్లాడారు. కార్పొరేషన్లు ప్రభుత్వంపై ఆధారపడకుండా టెక్నాలజీ వినియోగించుకొని ఎదగడంపై దృష్టి పెట్టాలన్నారు. ఆయిల్‌పాం నర్సరీల్లో నాణ్యమైన మొక్కలు పెంచి, 2024-25 లక్ష్యాన్ని అందుకోవాలని ఆదేశించారు. సమావేశంలో స్టేట్ సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేశ్‌రెడ్డి, ఆగ్రోస్ చైర్మన్ బాలరాజు, ఆయిల్‌ఫెడ్ చైర్మన్ రాఘవరెడ్డి, స్టేట్ కోఆపరేటివ్ యూనియన్ చైర్మన్ మోహన్‌రెడ్డి, వేర్‌హౌస్ కార్పొరేషన్ చైర్మన్ నాగేశ్వరరావు, మార్క్‌ఫెడ్ చైర్మన్ గంగారెడ్డి, వ్యవసాయశాఖ సెక్రటరీ రఘునందన్‌రావు, టెస్కో ఎండీ శైలజారామయ్యర్, వ్యవసాయశాఖ సంచాలకుడు గోపి, హార్టికల్చర్ సంచాలకురాలు యాస్మిన్, స్టేట్ వేర్ హౌస్ కార్పొరేషన్ ఎండీ లక్ష్మి ఉన్నారు.

యూరియా కోసం రైతుల నిరీక్షణ

పాలకుర్తి, ఆగస్టు 3: జనగామ జిల్లా పాలకుర్తి రైతు సేవా సహకార సంఘం వద్ద యూరియా కోసం రైతులు శనివారం బారులు తీరారు. మండలంలోని పలు గ్రామాల నుంచి 500 మంది రైతులు ఉదయమే సహకార సంఘం వద్దకు తరలివచ్చి లైన్‌లో నిలబడ్డారు. అయినా యూరియా అందక ఇబ్బందిపడ్డారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొస్తానన్న మార్పు ఇదేనా అంటూ మండిపడ్డారు. రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉంచని ఈ ప్రభుత్వం ఉన్నా ఒక్కటే.. లేకున్నా ఒకటేనని విమర్శించారు. రైతులు తప్పని పరిస్థితిలో యూరియా కోసం ప్రైవేట్ దుకాణాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. శనివారం సహకార సంఘానికి 444 బస్తాల యూరియా దిగుమతి కాగా.. 185 మందికి పంపిణీ చేసినట్టు సిబ్బంది తెలిపారు. మిగిలిన రైతులకు యూరియా అందక నిరాశతో వెనుదిరిగి వెళ్లిపోయారు. సొసైటీ మేనేజింగ్ డైరెక్టర్ సత్యనారాయణను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులో లేరు.

కాంగ్రెస్ పాలనలో రైతులకు మళ్లీ కష్టాలు

రైతులకు మళ్లీ ఉమ్మడి రాష్ట్రంలోని రోజులు గుర్తుకొస్తున్నాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఏ ఒక్క రోజు రైతులు యూరియా కోసం ఇబ్బంది పడలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 6 నెలల్లోనే రైతుల కష్టాలు మొదలయ్యాయి.

-దయ్యాల భిక్షపతి, రైతు, మల్లంపెల్లి

ఆడిట్‌లేదు..అరాచకమే!

మొదటిపేజీ తరువాయి...

వ్యక్తమవుతున్నాయి. హైదరాబాద్ హెడ్ ఆఫీసులోని అధికారులు డీసీఎంఎస్‌లకు ఎరువులను సరఫరా చేసి తమ పని అయిపోయినట్టుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. జిల్లా స్థాయి అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ అవకతవకలు పాల్పడుతున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికే ఖమ్మం, నల్లగొండ, ఆదిలాబాద్‌లో రూ. లక్షల్లో అవకతవకలు బయటపడగా తాజాగా కరీంనగర్ జిల్లాలోనూ అవినీతి బయటపడింది. ఎరువులు విక్రయించగా వచ్చిన సొమ్ము మార్క్‌ఫెడ్‌కు జమ చేయకుండా కింది స్థాయి ఉద్యోగులు కాజేసినట్టు తేలింది.

నివేదికల్లో తేడా!

కరీంనగర్ జిల్లాలో జరిగిన ఘటనపై ఓ అధికారి దర్యాప్తు జరిపి అంతా సవ్యంగానే ఉందని రిపోర్టు ఇవ్వగా 10 నెలల తరువాత విచారణ జరిపిన మరో ఉన్నతాధికారి రూ.76 లక్షలకుపైగా దారి తప్పినట్టు నివేదికనిచ్చారు. 2022-23, 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గత సెప్టెంబర్‌లో హెడ్ ఆఫీస్ నుంచి ఓ అధికారి నేతృత్వంలోని బృందం కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, సిరిసిల్ల జిల్లాలో పర్యటించి ఎరువుల విక్రయంలో లెడ్జర్లను, ఖాతాలోని సొమ్మును పరిశీలించింది. విచారణలో ఎరువులు విక్రయించిన సొమ్ముకు, బ్యాంకుల్లో ఉన్న సొమ్ము సరిపోయిందని అదే నెలలో రిపోర్ట్ ఇచ్చింది. ఈ బృందం సిద్దిపేట, మెదక్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, నారాయణపేట జిల్లాల్లోనూ విచారణ చేసింది. గత నెల మొదటివారంలో కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, సిరిసిల్ల జిల్లాలో ఎరువుల సొమ్ము కాజేశారనే ఫిర్యాదు వచ్చింది. దీనిపై ఉన్నతాధికారులు మరో అధికారి నేతృత్వంలో విచారణ కమిటీ వేశారు. ఈ విచారణలో రూ.76.77 లక్షల సొమ్ము పక్కదారిపట్టినట్టు బట్టబయలైంది. దీనికి బాధ్యులైన అధికారిని వెంటనే సస్పెండ్ చేశారు. గత సెప్టెంబర్ నివేదికలో సొమ్ము సవ్యంగా ఉందని, తాజా విచారణలో అక్రమాలు జరిగాయని నివేదిక రావడంపై మార్క్‌ఫెడ్ వర్గాలు అనుమానం వ్యక్తం చేస్తున్నాయి.

వరుస ఘటనలు.. అయినా మొద్దునిద్ర

ఎరువుల విక్రయంలో సొమ్ము పక్కదారిపట్టడం ఇదే మొదటిసారి కాదు.. గతంలో ఖమ్మంలో రూ. 40 లక్షలు, నల్లగొండలో రూ. 60 లక్షలు, ఆదిలాబాద్‌లో రూ.50 లక్షలు పక్కదారి పట్టాయి. హెడ్ ఆఫీసు నుంచి డీసీఎంఎస్‌లకు ఎంత మొత్తం ఎరువులు ఇచ్చాం, అందుకు ఎంత డబ్బు రావాలనే లెక్క ఉంటుంది. అమౌంట్ తక్కువగా వస్తే అధికారులను ఎందుకు ప్రశ్నించడం లేదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఇవీ కొన్ని ఘటనలు..

- 2013-14, 2014-15కు సంబంధించి నిజామాబాద్ జిల్లా నుంచి రూ. 50 లక్షల జింక్ బకాయిలు ఉన్నట్టు తెలిసింది. ఈ విషయాన్ని ఇప్పటివరకు కూడా అధికారులు తొక్కిపెట్టినట్టు సమాచారం.
- ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల నుంచి రూ.1.5 కోట్ల ఎరువులు బకాయిలు ఉన్నట్టు తెలిసింది. రికవరీకి అధికారులు శ్రద్ధ వహించడం లేదు.
- ఎరువులకు సంబంధించిన ఆదిలాబాద్‌లో రూ. 50 లక్షలు, ఖమ్మం జిల్లాలో రూ. 40 లక్షలు, నల్లగొండ జిల్లాలో రూ. 60 లక్షలు పక్కదారి పట్టాయి.
- కరీంనగర్ జిల్లాలో రూ.76 లక్షలు పక్కదారి పట్టాయి. ఇప్పటి వరకు 2.26 కోట్ల మార్క్‌ఫెడ్ సొమ్ము దోచుకున్నట్టు తేలింది.

ఆడిట్ లేదు.. అంతా అరాచకమే

రాష్ట్రంలో రైతులకు 60 శాతం ఎరువులను మార్క్‌ఫెడ్ సరఫరా చేస్తుంది. డీసీఎంఎస్‌ల నుంచి ప్యాక్స్‌కు, ఇతర ఔట్‌లెట్స్‌కు అందించి అక్కడి నుంచి రైతులకు అందజేస్తుంది. మార్క్‌ఫెడ్ ప్రతియేటా రూ.600 కోట్లకు పైగా లావాదేవీలు జరుపుతుంది. భారీ మొత్తంలో వ్యాపారం చేస్తున్నప్పటికీ ఎరువుల సరఫరా, విక్రయానికి సంబంధించి ఆడిట్ జరగడం లేదని తెలిసింది. రెండేండ్లుగా ఆడిట్ లేకపోవడంతో అధికారులు ఆర్థిక అరాచకాలకు తెర తీసారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గతంలో మా దృష్టికి రాలేదు

కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, సిరిసిల్ల జిల్లాలో అవకతవకలు జరిగినట్టు నిరుడు ఇచ్చిన నివేదికలో వెల్లడికాలేదు. ఈ ఏడాది జూలై 5న దృష్టికి రాగానే విచారణ జరిపాం. ఇందులో అవకతవకలు జరిగినట్టు గుర్తించి సంబంధిత అధికారిని సస్పెండ్ చేశాం.

-విష్ణువర్ధన్‌రావు, మార్క్‌ఫెడ్ జీఎం

మాజీ సీజేఐ ఎన్వీ రమణతో మందకృష్ణ

మాజీ సీజేఐ రమణతో మందకృష్ణ భేటీ

తీర్పు అమలుపై సలహాలు కోరిన మాదిగ నేత

హైదరాబాద్, ఆగస్టు 3 (నమస్తే తెలంగాణ): ఎస్సీ వర్గీకరణ ద్వారా రిజర్వేషన్ ఫలాలు దక్కాలంటే ఇప్పుడు రాష్ట్రాల్లో పోరాటాలు చేయాలని మాజీ సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ సూచించారు. శనివారం మందకృష్ణ మాదిగ నేతృత్వంలో ఎమ్మార్పీఎస్ బృందం మాజీ సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణతో భేటీ అయ్యింది. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు వెలువరించడంతో దీన్ని ఎలా అమలు చేయాలి.. ఎలా ముందుకు సాగాలన్న విషయాలపై ఆయన సలహాలను మందకృష్ణ కోరారు. ఇక ఇప్పుడు రాష్ట్రాల్లో పోరాటాలు చేయాలని మాజీ సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ సూచించారు. ఈ సందర్భంగా ఎన్వీ రమణకు మందకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. ఆయన సీజేఐగా ఉన్నప్పుడే ఎస్సీ వర్గీకరణ అంశాన్ని విస్తృత ధర్మాసనానికి బదిలీ చేశారు. ఎస్సీ వర్గీకరణ కోసం మంద కృష్ణ చేసిన మూడు దశాబ్దాల పోరాటాన్ని మాజీ సీజేఐ అభినందించారు.